# ఆంధ్ర నాటకరంగము


శ్రీ దేవులపల్లి

వెంకట లక్ష్మీనరసింహారావు గారు


శ్రీ నరసింహారావు గారి చాణక్యుని, రామదాసును * మొనమొన్న నే క్రొత్తగా చూచుభాగ్యము గల్గినది. వీరియందుత్తమనట లక్షణములు మొలకలెత్తియున్నవి. క్రమముగ నవి ప్రోదిగాంచి యాంధ్రనాటక రంగమున కాశ్రయము నొసంగగలవు. చాణక్యరామదాసుల స్వభావములు పరస్పర విరుద్ధములయినవి. శ్రీరావుగారియందవి ప్రత్యేకము సరిపోనగల్గినవి.

శ్రీరావుగారి గోపన్న రంగాలంకారమయినాడు; రామదాసుభక్తి యింకను నిశ్చలము, పరిపక్వము కాదగును. మఱియు వీరి చాణక్యపండితుడు రాజనీతికుశలుడు; నిష్ఠురుడు; కుటిలుడు; అభిమానఘనుడు. కాని, రావుగారి హృదయ మతిమాత్రావేశపూరితమయినది. దీనికిదోడు తోడిపాత్రముల యొనరుపాటు వీటి బోయినది. మనచాణక్యుని యుత్సాహము సన్నగిల్లినది. కర్తవ్యము ఇంచుక పేదవడినది.

చంద్రగుప్తుడు మహాచక్రవర్తి; కాత్యాయనుడు మహామంత్రి. చాణక్యమహాశయుడు భారతమహాసామ్రాజ్యరథమును నిర్మించి దానిని నడపుటకు దగుదురని వీరి నిర్దేశి నేర్చి కూర్చినాడు. వీరు, నిక్కము మహాపురుషులు. కాని, ప్రదర్శనము వీరి నన్యథాకరించినది. చంద్రగుప్తుడనుచితపాత్రమయినాడు; కాత్యాయనుడు పరిహాసపాత్రమయినాడు. చాణక్యునియుత్సాహ మడుగంటుట కిది చాలదా!

నటుడు విద్యావంతుడు, సంస్కారి, నాట్యకళాకోవిదుడు కావలెను; చక్కని ప్రపంచజ్ఞానము నార్జింపవలెను. ఇందేది కొఱవడినను తాను ధరించుపాత్రముకొఱవడి పరిభవముపాలగును. ఇట మఱికొన్ని యుపయుక్తవిషయముల నుపదేశించు శ్రీభావరాజు వెంకటకృష్ణరావుగారి §యీ క్రిందివాక్యములు పఠింపదగినవి.

---

* మొన్న ఆగష్టుమాసమున ఏలూరు సీతారామాంజనేయ నాటకసమాజమువారు చెన్నపురమున నాటకములను బ్రదర్శించుచుండిరట. వారు చిట్టచివరవిగా చంద్రగుప్త, రామదాసు నాటకములను ప్రదర్శించిరి. శ్రీలక్ష్మీనరసింహారావుగారి కోరికపై నేనా నాటకములను జూచితిని. అందు చంద్రగుప్తనాటకము సుప్రసిద్ధవంగనాటకకర్తయగు ద్విజేంద్రలాలు రాయిగారి రచనమునకు శ్రీయుత నండూరిశివరావుగారు కావించిన యాంధ్రానువాదము. రాయిగారి చంద్రగుప్తుని పాత్రముయొక్క యౌచిత్యమునుగూర్చి కొన్ని సంశయములు గలవు. వానిని గూర్చి యించుక విన్నవింప గోరిక గలదు. ఇంకొకమారు దానిని దీర్చుకొందును.

§ కడచిన (శ్రావణమాస) భారతియందు శ్రీభావరాజు వెంకటకృష్ణరావుగారు శ్రీనరసింహారావుగారి నటనకౌశలమును గూర్చి సచిత్రముగా నొకచక్కనివ్యాసమును వ్రాసియున్నారు. దానిని గాంచనగును.

5. 9- 20

తాను ధరించుపాత్రను అనుభవముచే తెలుసుకొని యందు లీనమైపోయి తన్మయత్వమునటించు భావనామూర్తియు, అనుభవజ్ఞుడు నగువాడే నిజమయిన నటు డనిపించుకొనును. అనుభవ, భావనలలో నేదిలోపించినను నటుని అభినయము, నటన పరిపూర్ణత్వమును పొందనేరవు. నటుడు తన జీవితమునం దనుభవించిన కష్టసుఖముల యనుభవసారమైన రసములనుమాత్రమే భావనాప్రజ్ఞచేత నినుమడింపజేసి ప్రదర్శింపగలడు. కావున ప్రతినాట్యసేవియు అన్ని రసములను ప్రకటింపజాలడు. అన్నిరసములను సమముగా ప్రకటింపజాలిన నటు లెవ్వరయిన రసమూర్తులు ఒక రిద్ద రెక్కడయిన నుండవచ్చును. అట్టివారు మహాప్రతిభాశాలురు. వారి జీవితము కేవలము రసాత్మక మైనదిగా నుండును. సాధారణముగా ప్రతినటుడును తనప్రకృతికి సహజములయిన రసములనే బాగుగా నటింపగలడు.

ఆంధ్రనటకులు పై విషయములను పాటింప దగుదురు. ఆంధ్రనాటకరంగమునకు దాము, తమకు నాటకరంగమును సర్వథా సరిపోవునట్లు సంస్కరించుకొన దగుదురు.

శ్రీనరసింహారావుగారి చాణక్యరామదాసు పాత్రములనుబోలె బాహుకపాత్రమును గూడ జూడ కుతూహలము గలదు.

గ. సు.

(భారతీకార్యాలయము)

---

## స్థానం నరసింహారావుగారు-'సత్యభామ'

శ్రీ స్థానం నరసింహారావుగారు పేరెన్నికగన నటకావతంసులు.

వీరు తమ ధరించుపాత్రమున తమ్ము తాము చతుగ్రముగ దిగగొట్టుకొందురని శ్రీయుత వేలూరి శివరామశాస్త్రిగారు నుడివినది. వీరి నటనమును విమర్శించుటచే పెక్కతావుల జ్ఞప్తికి వచ్చుచుండును. కాని వీరి సత్యభామాపాత్రము*మాత్ర మీపరిచయములో సంతృప్తి నిడక యించుక యెక్కువ విమర్శనము నపేక్షించుచున్నది.

వీరి నటనమున నొక యమోఘమగు సమ్మోహనశక్తి యున్నది. ఎట్టిపాత్రమైనను వీరు సజీవముగ, నుజ్జ్వలముగ ప్రదర్శింతురు. సత్యభామాపాత్రయు వీరు తాము భావించినతీరున సమగ్రసౌష్ఠవముతో ప్రదర్శింతురు.

వీరిభావన ననుసరించిన సత్యభామ యెట్టిదో పరామర్శించుటకు ముందు శ్రీకృష్ణ తులాభారమున సత్యభామ యెట్టిదో గుఱుతింపదగును.

సత్యభామ శ్రీకృష్ణుని సంపూర్ణముగ ప్రేమించినది: అతని సుందరమూర్తిని కామించినదియు. ఎల్లపుడు నతని సాన్నిధ్య మామెకు గావలెను. ఈఓరిమిలేని కూరిమిచే నామె తనహక్కునుగూడ నతిక్రమించి, తోడి దేవేరులకు భర్తను పాలువెట్ట నొల్లదు. కనుకనే రుక్మిణికి గల అతిలోకప్రేమ కిది లొంగ్కినది. భక్తి యను పేరునకు యోగ్యత యీప్రేమకు చాలినదికాదు. ఐనను సత్య గొప్ప ప్రేమికురాలు. రాజస ప్రేమచే నామె మత్తిల్లిపోయినది. ఆప్రేమ సామ్రాజ్యమునకు శ్రీకృష్ణుడు సార్వభౌముడు; తాను మహారాజ్ఞి. ఈశ్రీకృష్ణుడు భౌతికమూర్తి. తన్నాభౌతికమూర్తి వీడినచో నామెహృదయ మాక్రోశించును. ఆత్మదమనము చేసికొను ధీరత యామెకు లేకపోలేదు: కాని, అతనిసాన్నిధ్యమున తా నుపలాలిత యగుచు అతని నాశించుకొనుచున్న సమయమున తనసవతి తనపతి నెడబాప—తోడగొంపోవ—వచ్చినచో నామె యోర్వజాలదు. ఇంద డచుకొను ధీరత యామెకు లేదాయనిన, సవతిమూలమున రెచ్చిన యభిమానము నడచుకొనుటకే యిచ్చగింపని రాజస ప్రకృతి యామెది. రుక్మిణి తన జన్మదినోత్సవ

---

* ఆగస్టు ౯ వ తే. శ్రీదుర్గా ఎమెచూర్సువారు మదరాసునందు ప్రదర్శించిన శ్రీకృష్ణతులాభారమున వీరి 'సత్యభామ'ను నేను జూచితిని.

మునకై పతి నాహ్వానించినది—తగినంత హేతువున్న దియే: ఐనను సత్యభామ కిష్టముకాని సందర్భమునకు సవతి కారణభూతయైనది: ఆమె ఆత్మదమనము కావించుకొనదు.

ఇట్టియెడ శ్రీకృష్ణుడు తా నెవరియింటి కేగ వగునని అన్యుడగు నారదుని నాలోచన మడుగుట ఆమె కింకను వెగటగును. ఇక చివరకు తన యింటికి రాక యతడు సవతి రుక్మిణి యింటికే యేగినచో ఆమెకు గల్గు మనఃక్షోభమునకు మేర యేముండును?

ఆసమయమున నారదు డామెకు వ్రత ముపదేశించి దాన నామె తనభర్తను తనకు వశవర్తిని జేసికొనగల్గునని వచింప, నామె తన తప్తమానసము నాపేరాస యందు పోసికొన్నది. సరితూగు ధనాదికము నిచ్చి దానము పోయిన భర్తను బడయుటకై ఆమె తన సర్వస్వమును తూనిక యిడెను. 'రెండు నిమిషములు కళ్లు మూసికొన్నచో, నాభర్తయెప్పటికిని నావాడే' యని యామె కొనవ్రేళ్లపై నిలిచియుండెను. ఎన్నివైచినను అతడు తూగడాయె!—ఏమి పోయినను సరే, అతడు దక్కిన చాలును!—కాని, యేదీ సాఫల్యము? ఎంతటి ఆశ!—ఉపహత మైపోయినది. ఎంతటిమూల్యము!—అపర్యాప్త మైపోయినది. ఏబరువున కాతడు తూగునో యామెకు తెలియదాయె! భౌతికమూర్తినే యామె తలచుకొనెను. శ్రీకృష్ణు డంతబరు వుండునని యామె యెఱుగదు; నారదుడు చెప్పనైన లేదట, ఏలయని యామె ప్రశ్నించినది. ఆమెకు తన యోచనయందు మూర్ఖత యేమియు కన్పడదు. మానవబుద్ధిబల మంతయు వినియోగించి మాచినను నది యర్థము కానిది. ఆమె అది కలహప్రియుని వంచనయని భావింప కేమిచేయును? (కృష్ణుడు తన్ను వంచింపడని యామెకు నమ్మకమే కాబోలు.)

ఇక కృష్ణుడు నారదునికి దాసుడైపోయినాడు. సత్యభామకు భర్త తనకడ లేకుంటయేకాక, యొకరికి దాస్యము సేయుచున్నాడు: దుర్భరము! అటుపై తన మూలమున తోడిదేవేరులు భర్తను గోల్పడిరి. తాను నగుబాటునకు గురియైనది. అంతయు తనవల్ల నైనదే.

కడచినదాని కనుతాపము; కృష్ణుడు తనతో మాటాడుటనుగూడ వంచకుడు నారదుడు నిర్దయముగ నిషేధించినందులకు కినుక; తన నిస్సహాయతకు పరితాపము—ఇంతయు భరించుచు, నెట్లయిన కృష్ణుని బడయుట కుపాయము నారయవలయును. ఇంతవ్యాకులత యామెహృదయమును కలచివైచుచున్నది. పాపము, అంతయు ప్రతికూలము కానా?

ఈసత్యభామకంటె మానవహృదయమును సమీపించు పాత్రలు నాటకలోకమున నెన్నియో లేవు. మానవప్రకృతి యామెయందు పూర్తిగ మూర్తీభవించినది. ఆమెది లౌకికత్వమున నికృష్టస్థానముగాదు; అతిలోకత్వమునకు దగ్గరమెట్టే. ఆమె ప్రేమకొఱ కెంత త్యాగమె నర్చినది!

ఇక నామెకు విశ్రాంతిలేదు. ఎట్లయిన పతిని బడయ నారదుని వెంటాడినది. చివరకు దేవేరులుగూడ వచ్చినారు. ఎట్లు మాట దక్కుట?

భక్తులవలన నామెకు భర్త తిరిగి లభించునని నారదుడు పల్కెను. అట్టి భక్తు లెచ్చటనైన గలరా యని యామె తహతహతో నడిగినది. తత్పురముననే యున్నారని యాత డమ్మతో పమానముగుమాట తెల్పెను. భక్తపద మామె హృదయమును మీటలేదు. 'నాకంటె భక్తు లెవ్వ'రని యామె యహంకృతి చూపలేదు. అట్టి భక్తు లెవ్వరో తెల్పినచో పాదములంటి తెచ్చుకొందునని చెప్పినది. ఆహా! ప్రేక్షకుల సానుభూతి బడయుట కీపాత్ర కెంతపాత్రత యున్నదో!

తన పల్కులకు నారదు డొసగిన యుత్తర మామె కొక పెద్దపరీక్ష: అభక్తురాలు రుక్మిణియేయట!

భర్తను దాస్యమునుండి విడిపించి, తాను బడయవలయును. శుద్ధాంతజనముకడ తనమానము గాపాడుకోవలయును. దేవేరులహక్కు నిపు డామె తిరస్కరింపదు: తానిపుడు మానవతి; కర్తవ్య జ్ఞానిని: ప్రేమ పీడితయయ్యు ప్రేమ ప్రమత్తురాలు గాదు.

ఏరుక్మిణియెడ కక్షగట్టి యామె కృష్ణునిస్వాధీనము గావించుకొనుటకై విలక్షణచర్యల జేయబూనెనో, ఆరు

క్మిణియే తన కిపుడాశ్రయణీయయైనది—ఆదర్శ్యల దుష్పరిణతి సంస్కరించుటకే! భర్తను బడయుట కెట్టిదియైన జేయవలయును: అతడు పూర్తిగ తనకే కావలె ననిపించు పొంగు ప్రేమ ఆమెది. తనయపరాధమును సవరించుకొనుట తనవిధి. తాను ప్రార్థింపకయే రుక్మిణి వచ్చి యాతని విడిపించుట తన కవమానము. ఆమె యహంకారిణి కాదు: ఉత్కృష్టయగు నభిమానిని. సవతిని వేడుకొనుటకంటె వేడుకొనకుండుటయే యామె యభిమానమున కెక్కువ యాఘాతము. రుక్మిణిని వేడుకొన్నది; భర్తను—తన ప్రయత్నమువలననే—విముక్తు జేసి, పడసి, తన కర్తవ్యము నిర్వహించుకొన్నది; రుక్మిణిహృదయము తనహృదయముకంటె మహత్తరమగుట గ్రహించినది: ఏలయన—రుక్మిణి శ్రీకృష్ణుని మనసార భజించినది. అత డెక్కడ నున్నను సరియే, భావబద్ధుడగు ప్రేమమయుడు తనతోడనే యున్నాడు. తృప్తిమయమైన భక్తితో నామె తన పతిని భగవంతునిగ నుపాసించుకొన్నది.

సత్య శ్రీకృష్ణునకునలెనే యెల్లరకును సానుభూతికి పాత్రురాలు. ఆమె యేమొనర్చినను కృష్ణునెడగల ప్రేమాతిశయమువలననే. పవిత్రమైనది కారణము: కార్యములమాత్రము హృదయదౌర్బల్యపు రకు లున్నవి.

ఇది యీనాటకమునందలి సత్యభామ.

శ్రీనరసింహారావుగారి భావనమాత్ర మించుక భిన్నరూపముగల పాత్రను ప్రదర్శించెను.

నటకుడు కవిరచించిన పాత్రకు సంస్కారములు చేసికొనవచ్చునే కాక చేసికొనవలసిన సందర్భములు గూడ నుండును. ఐన నాసంస్కారములు నాటకమున కుపకరింపవలెను; నాటకముయొక్క నాటకత్వమునకువన్నె తేవలయును. నాయికా నాయకపాత్రములను నటకుడు గాని, కవిగాని ప్రేక్షకుల సానుభూతి కేంద్రమునకైనను సాధ్యమగునంత సమీపమునకు గొంపోవలయును.

ఈనాటకమున సత్యభామయే కేంద్రవర్తిని—నాయిక. ఈపాత్రము నరసింహారావుగారియందు నాటకప్రయోజనమున కెట్టు లుపకరించెనో గమనింపదగును.

నారదునకు శ్రీకృష్ణుని భార్యలు తక్కినవారు ప్రణమిల్ల. శ్రీరావుగారి సత్యభామమాత్రము వంగియే నమస్కరించును. కృష్ణుడు రుక్మిణి యింటి కేగినపిదప తనభవనమున నారదుడు విచ్చేసినపుడు అతి విముఖతతో అడకువ లేక వర్తించును. అత డామెకు భర్తను బడయునుపాయముగ వ్రత ముపదేశించినపిదప నామె యతనికి మోకరిల్లి నమస్కరించి, దాసిచే గూడ ప్రణమిల్ల జేయును.

తక్కిన దేవేరులకుకంటె సత్యభామకు నారదునియెడగల భక్తి తక్కువయా? వారితో సమముగ దేవర్షి యెదుట మోకరిల్లుట తన కవమానమని యెంచునంతటి దురభిమానినిగాని, మూర్ఖురాలుగాని కాదు. సత్య తన యింట నతనియెడ నంత వైముఖ్యమును, అవినయమును జూపుటకు అతనియెడ నామె కింతచన వున్నను జాలదు; ఎచ్చట జూచినను ఆమె కాచన వున్నట్లు కన్పడను లేదు. తనభర్త తనకడకు రాకుండ జేసినది నారదుడే యనుకోపమున నట్లు వర్తించెనన్న, ఎట్లయిన నతని సత్కరించునేకాని గౌరవాచారములు తప్పదు: కళావతి రాజపుత్రి, శ్రీకృష్ణునిదేవి: ఆమె కాతనియెడ గౌరవము లేకపోనులేదు. చివరకు తన కాతనివలన నొక ప్రయోజనమున్నదని భావించి ప్రణమిల్లుట దుఃస్వార్థపరతను, సంకుచిత మనస్కతను సూచించును. దేవర్షియెడ సత్యభామ కంతగౌరవము గల్గుట కిదియే మొదటిసారియా, ప్రయోజన మున్నపుడెల్ల నట్లు ప్రణమిల్లునా యనిపించును. పాత్రకు లేని నలుపులు గూర్పరాదు: అట్టి కళంకితపాత్ర కిట నావశ్యకత లేదు.

శ్రీకృష్ణుని తూచునపుడు వీరి సత్యభామ తన యింటగల సర్వస్వమును త్రాసున వైచునుగాని తనయొడలియాభూషణాదు లొక్కపూసయైనతొలగించి వైవదు. చిట్టచివరి యత్నముగూడ చేయక యామె వీడునా? అంత పరితపించిన ప్రేమ కృష్ణునినిమిత్తమై యాభూషణముల తొలగించివేయుటకు కానుదీయనిచ్చునా? ఇట సమంజసత తక్కువ. కృష్ణుడు సంస్కరింపనెంచిన సత్య

భామ హృదయము ప్రాపంచికతయం దింతక్రింద లేదు. సత్యభామ యిట్టిదన్నచో నాటకము సహింపజాలదు.

కృష్ణుడు నారదునకు దాసుడైపోయినపుడు వీ రతిచతురతతో నటించిరి. పిదప గన్పట్టుపదగిన దైన్యపరిమాణముమాత్రము వీరియం దహంకారాతిశయమున మట్టుపడ్డది. పాత్రకు దైన్యము తనతో ప్రేక్షకులసానుభూతిని కొలుపుచ్చినచో, అహంకార మాస్థానమున ప్రేక్షకుల ప్రశంస నాకర్షింప లేదు.

మొత్తముమీద వీ రభిమానముకంటె నహంకారము నెక్కుడ యుపాసించిరి: రాజసముకంటె తామసము నెక్కుడ యవలంబించిరి. వీరిసత్య కడుంగడు సాధారణవనిత. ఈనాటకమునకు నాయికయగుట కనర్హగనున్నది.

చివర సత్యభామకు సంస్కారము గల్గినది. లేనిచో పాత్రకు సరియగు పరిణతి యుండదు. రుక్మిణిని వేడుకొనుటనుండి వీరిసత్యభామ సంస్కారమునొందు యోగ్యతతోనే యున్నది. ఆస్థితికిని, పూర్వపు ప్రవృత్తులకును సామరస్యము కుదురుకొనవలెను. అప్పుడు వీరిసత్య సత్యయగు సత్యయగును.

సత్యభామకంటె నెక్కుడ యాకర్షక మగుపాత్ర మీయితివృత్తమున లేదు.

ఇట్టిసంస్కారములు కొలదిగ నిర్వహించుకొన్నచో, శ్రీ నరసింహారావుగారి యంతటి యాకర్షకముగ నీపాత్రను ప్రదర్శింపగలవా రరుదుగ నుందురు.

శ్రీరావుగారు రంగమున ప్రవేశించినది మొదలు నిష్క్రమించువఱకును పాత్రగనే స్ఫురింతురు కాని యొక్కత్రుటియు తమవలె గన్పట్టరు. అటుపై వారి నటనమున నొకవిధమగు నగిషీసొంపు లున్నవి. పాత్ర సజ్జీవలముగ చూపుటయందు వా రసాధారణమగు నేర్పుగన్పఱతురు. అట్టియెడ వా రిటనిట బాగుగ నటింతురని యెత్తి చెప్పుట యథార్థమగు ప్రశంస గాదు.

నటనా కౌశలమునకు తీసిపోవని గాన ప్రావీణ్యమును వీరి కున్నది. రసానుగుణమగు సంగీతము వీరియం దొక పెద్దగుణము. పద్యముగాని, పాటగాని పాడుచున్నపుడు వచనమునవలె భావమే వ్యక్తమగుచుండును. రస ముబ్బుగ చిందుచుండును. వారు గానప్రవీణు లను మాట దూరమున గన్పడును. వీరి సంగీతము రసమును మఱింత పరిస్ఫుటము చేయునే కాని పాత్రను విడిచి రంగమును కళంకిత మొనర్పదు. రంగమున సంగీత మావశ్యకమా యనుసమస్యను వీరియభినయము అనుకూలముగ సమర్థించును. ప్రతికూలవాదుల కది యొక గొప్పప్రతివాదము—ఇట్టివా రరుదుగ నుండుటచే ఆసమస్య మాత్రము తలచూపుచునే యుండును గాని—

వీరి యనల్పనటనా కౌశలము నిదివఱకు శ్రీయుతులు శివరామశాస్త్రిగారు తమసుధామధుర ఫణితుల నుగ్గడించియే యున్నారు. కాక వీ రాంధ్రసామాన్యమునకు ప్రత్యక్ష పరిచితులగు నటకావతంసులు. తమభావననుసరించి యేపాత్రనైనను వీ రతికుశలముగ ప్రదర్శింతురు. ఈపాత్రవిషయమున తమభావన తిరుగవేసికొనునపుడు శ్రీరావుగారు సహృదయములో ఈసూచనల గమనింతురు గాక. పాత్రశీలన కౌశలమును, భావనాబలమును వీరియం దింకను పెంపైనచో, తన నిగ్గైన నటులలో నొకరని వీరినిజూచి మన దేశము గర్వింపగలదు.

కొంపెల్ల జనార్దనరావు